సాక్షి నిజామాబాద్

మంగళవారం, 24, జనవరి, 2023



తైక్వాండోలో పతకాల పంట

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. జిల్లాకు 18 బంగారు పతకాలు వచ్చాయి.

- 8లో ▸



టీచర్ల బదిలీ షెడ్యూల్ ఖరారు

ప్రభుత్వ టీచర్ల బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 27 నుంచి బదిలీలు ప్రారంభం కానున్నాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /18.3

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. చలితీవ్రత కొనసాగుతుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇద్దరి ప్రాణాలు కాపాడిన ప్రభుత్వ వైద్యులు



నిజామాబాద్ సిటీ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ యువకుడు, మరో వృద్ధుడి ప్రాణాలు నిలిపారు ప్రభుత్వ వైద్యులు. ఎంతో రిస్కుతో కూడుకున్న ఆపరేషన్లు విజయవంతంగా పూర్తిచేసి వారికి పునః జన్మనిచ్చారు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వివరాలను నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన 18 ఏళ్ల అభినాష్ అనే యువకుడిని అతని స్నేహితులు కొట్టడంతో మెడపై తీవ్ర గాయమైంది. మెడపై గాయంతో ఎముకలు విరిగిపోయి రక్తం గడ్డ కట్టడంతో శ్వాస తీసుకోలేని పరిస్థితిలోకి వెళ్లాడు. దీంతో వైద్యుడు సునీల్ ఆధ్వర్యంలో వైద్యులు వెంటనే శస్త్రచికిత్స చేసి అతడి ప్రాణాలు కాపాడారు. అలాగే పోతంగల్ మండలానికి చెందిన 92 ఏళ్ల వృద్ధుడు సూదం లక్ష్మయ్యకు అస్టిక్‌సెల్ క్యాన్సర్ వ్యాధి సోకింది. వృద్ధుడి చెవి వెనకాల పెరటిడ్ గ్లాండ్ వాచి కణితితో బాధపడుతుండగా అతడికి పరోటిడెక్టమీ సర్జరీ చేసి వైద్యులు కణితిని తొలగించి ప్రాణాలు కాపాడారు. ఆపరేషన్లు నిర్వహించి ఇద్దరి ప్రాణాలను కాపాడిన వైద్యులు సునీల్, రామచంద్రయ్య, మురళీకృష్ణ, మధుకర్, కిరణ్ మాదాల బృందాన్ని ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అభినందించారు.

వైద్యకళాశాలలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నిజామాబాద్‌సిటీ: ప్రభుత్వ వైద్యకళాశాలలో ఖాళీగా ఉన్న 16 ట్యూటర్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి ఈ నెల 31వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ట్యూటర్లు(వైద్యేతర పోస్ట్ గ్రాడ్యుయేట్లు) ఎమ్మెస్సీ(మెడికల్) సంబంధిత డిగ్రీ ఉన్న వారు అర్హులని తెలిపారు. అర్హుల ఎంపికలో సంబంధిత మెడికల్ సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ట్యూటర్ పోస్ట్ కాలవ్యవధి మూడేళ్లని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ప్రిన్సిపల్ ఆఫీస్, మెడికల్ కాలేజీ, నిజామాబాద్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఫిబ్రవరి 4న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థి వయస్సు 45 ఏళ్ల కంటే తక్కువ కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 57,700లు వేతనంగా చెల్లిస్తామని ఆమె తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారాన్ని www.gmcnzb.org ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఫిబ్రవరి 2న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ డాక్యుమెంట్లతో ప్రిన్సిపల్ కార్యాలయంలోని వెరిఫికేషన్ కమిటీ ద్వారా సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు.

పోస్టుల ఖాళీల వివరాలు..

- అనాటమీ–04
- ఫిజియాలజీ–04
- బయోకెమిస్ట్రీ–04
- ఫార్మకాలజీ–02
- ఫోరెన్సిక్ మెడిసిన్–02

నిరీక్షణ ఫలించేనా..

- ఈసారైనా తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తారా!
- మార్చి, మే నెలల్లో ఇద్దరు ఎమ్మెల్సీల కాలపరిమితి ముగింపు
- మళ్లీ పదవులు ఆశిస్తున్న వీజీ గౌడ్, రాజేశ్వర్
- మరోవైపు నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూపులు







సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ మలిదశ ఉద్యమంలో జిల్లాకు చెందిన ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారు. అయితే వీరికి చెప్పుకోదగిన పదవులు మాత్రం దక్కలేదు. ఈ నేపథ్యంలో పలు మార్లు ఎమ్మెల్సీ, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల చైర్మన్ స్థానాలకు పలువురు తమవంతు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. కాగా ప్రస్తుతం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పదవీకాలం వచ్చే మార్చి 30 న, గవర్నర్ కోటా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మరో ఎమ్మెల్సీ రాజేశ్వర్ పదవీకాలం వచ్చే మే 27న ముగియనుంది. అయితే వీరిద్దరూ మళ్లీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వీజీ గౌడ్ 9 ఏళ్ల పాటు డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. టీడీపీ నుంచి ఎమ్మెల్సీగా ఉండి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకుని వరుసగా రెండోసారి టీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీ అయ్యారు. వైఎస్‌ఆర్ అనుచరుడిగా ఉన్న రాజేశ్వర్ 2007లో మొదటిసారి ఎమ్మెల్సీ అయ్యారు. తరువాత 2011 లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి సహకారంతో, మరోసారి 2017లో సీఎం కేసీఆర్ సహకారంతో వరుసగా మూడోసారి ఎమ్మెల్సీగా నామినేట్ అయి కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా పలువురు ఉద్యమకారులు ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఎమ్మెల్సీలు కాదు కదా కనీసం నామినేటెడ్ పదవులు సైతం ఇవ్వకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఆవిర్భా వం నుంచి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఏకధాటిగా 13 ఏళ్ల పాటు వ్యవహరించిన ఏఎస్ పోశెట్టికి ఇప్ప టివరకు ఎలాంటి పదవి ఇవ్వలేదు. ఏఎస్ పోశెట్టి రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడిగానూ, పొలిటికల్‌అఫైర్స్ కమిటీ వైస్ చైర్మన్‌గా, పొలిట్ బ్యూరో సభ్యుడిగానూ పనిచేశారు. పోశెట్టికి ఇప్పటివరకు ఏ పదవీ ఇవ్వలేదు. అదేవిధంగా పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ పదవుల్లో పనిచేసిన సుజిత్ సింగ్ ఠాకూర్ సైతం ఏ పదవులూ లేకుండా ఉన్నారు. ఠాకూర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా కీలకంగా పనిచేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఈగ గంగారెడ్డి ఎమ్మెల్సీ ఆశించినప్పటికీ ఫలితం దక్కలేదు. అలాగే ఈగ సంజీవరెడ్డికి మాత్రం ఇటీవల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష పదవి దక్కింది. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న కమ్మర్‌పల్లి మండలానికి చెందిన కొత్తూరు లక్ష్మారెడ్డి, సత్యప్రకాష్, చింత మహేష్, కరిపె రాజు, తెలంగాణ శంకర్, ఈర్ల శేఖర్ లకు సైతం ఎలాంటి పదవులు రాలేదు. ఈ క్రమంలో పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన కొందరు ఉద్యమ నాయకులు ఇతర పార్టీల్లోకి మారిపోయారు.

■ జిల్లా నుంచి గతంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా వ్యవహరించిన ఆకుల లలిత పదవీ కాలం ముగిసిన తరువాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పదవిని ఆశించినప్పటికీ దక్కలేదు. కల్వకుంట్ల కవితకు ఆ పదవి దక్కింది. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకుల లలితకు రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్టును ఆకుల లలిత ఆశిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నిజామాబాద్ అర్బన్‌లో మైనారిటీల తరువాత మున్నూరుకాపు సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమీకరణాల నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా ఉన్నప్పటికీ లలిత ఈ టిక్కెట్టు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే లలిత నగరంలో మున్నూరుకాపు కార్తీక వనభోజనాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొన్నారు. లలిత తన సొంత నియోజకవర్గం ఆర్మూర్ బదులు తన సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్న నిజామాబాద్ అర్బన్‌ను ఆశిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఉద్యమకారులు ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. వారిలో ఎవరికైనా అవకాశం దక్కుతుందో లేదో చూడాలని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అందుబాటులో నాణ్యమైన విత్తనాలు



విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయానికి శంకుస్థాపన

వేల్పూర్ : విత్తన ధ్రువీకరణ సంస్థను స్థానికంగా ఏర్పాటు చేయడం వల్ల రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద నిర్మించనున్న విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయం రైతులకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ఇక్కడ ఏర్పాటు చేయించామన్నారు. బాల్కొండ నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలన్నీ అన్ని రకాల పంటలతో వ్యవసాయ పరంగా ఎంతో అభివృద్ధిలో ఉన్నాయన్నారు. సంస్థ ఏర్పాటు వల్ల వారికి ప్రతియేటా అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలతో పాటు, నూతన వంగడాలు అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. సంస్థ కార్యాలయంతో పాటు విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి సమీపంలో ఉన్న స్పైసిస్ పార్కులో స్థలం కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వర్ రావు, రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధ్రువీకరణ సంస్థ సంచాలకులు డాక్టర్ కేశవులు, విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ సంజీవ్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ, వైస్ చైర్మన్ నల్లరమేశ్, ఎంపీపీ బీమజమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా పూర్తి చేయాలి

భీమ్‌గల్: భీమ్‌గల్‌లో జరుగుతున్న వంద పడకల ఆస్పత్రి, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ పనులను గడువులోగా పూర్తి చేయాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనులు వేగంగా జరగాలని, నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. అనంతరం మెండోరా గ్రామ అప్రోచ్‌రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు.

బాసరకు ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: వసంత పంచమి సందర్భంగా ఈ నెల 26న హైదరాబాద్‌లోని జేబీఎస్ నుంచి బాసరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఉషాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న సాయంత్రం నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే నిజామాబాద్ నుంచి బాసరకు, బాసర నుంచి నిజామాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యోగుల సహకారంతో అగ్రగామిగా రాష్ట్రం



టీఎన్జీవోస్ డైరీలను ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, కలెక్టర్, సీపీ

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకే జీతాలు ఎక్కువ
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్‌నాగారం: పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగులను తాము ఎన్నడూ వేరు చేసి చూడలేదని.. వారి సహకారంతోనే అన్ని రంగాల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ ఆధ్వర్యంలో నూతన కలెక్టరేట్‌లో నిర్వహించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల వరకు తీసుకెళ్తున్నారన్నారు. దేశంలోనే ఉద్యోగులకు అత్యధిక జీతాలు అందిస్తున్నది కూడా తెలంగాణ రాష్ట్రమేనన్నారు.

నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలి : కలెక్టర్

ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో టీఎన్జీవోలు కృషి చేస్తున్నారని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అప్పుడే ఉద్యోగులకు కూడా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యాలయాలకు వచ్చే వారితో ఉద్యోగి అనుకూల ధోరణితో వ్యవహరిస్తూ వారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. కాగా జిల్లా కేంద్రంలో ఉద్యోగుల కోసం కల్యాణ మండపం నిర్మాణానికి రూ. కోటి నిధులు కేటాయిస్తానని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ప్రకటించగా, తనవంతు తోడ్పాటు అందిస్తానని మంత్రి ప్రశాంత్ రెడ్డి భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, సీపీ నాగరాజు, మేయర్ నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షురాలు మంజుల, టీఎన్జీవోస్ నాయకులు అమృతకుమార్, చిట్టినారాయణరెడ్డి, నాగరాజు, సుమన్ పాల్గొన్నారు.

మంచిప్ప నిర్వాసితులపై కేసులు ఎత్తివేయాలి

ఖలీల్‌వాడి: మంచిప్ప నిర్వాసితులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని పౌరహక్కుల నేతలు తీర్మానించారు. నగరంలో సోమవారం పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. మంచిప్ప నిర్వాసితులైన గొల్ల శ్రీనివాస్, దియావత్ శంకర్‌లపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం సరైందికాదన్నారు. అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్, ఇండస్ట్రీయల్ పార్కును రద్దు చేయా లన్నారు. పసుపు పంటకు, ఎర్రజొన్న పంటలకు గిట్టుబాటు ధరను చెల్లించాలని, పసుపు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అలాగే నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా భూమాగౌడ్, కొంగర శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆల్గొట్ రవీందర్, కార్యదర్శులుగా కేతవత్ బీక్ సింగ్, గుర్రం జలంధర్, పోతే ప్రవీణ్, కోశాధికారిగా భాస్కర స్వామి, నలుగురు కార్యవర్గ సభ్యుల్ని ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి రవీందర్ తెలిపారు.

10,014 మందికి కంటి పరీక్షలు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో కంటి వెలుగు పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జిల్లాలో 10,014 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దగ్గరి చూపు అద్దాలు 2,327 మందికి, దూరపు చూపు అద్దాలు 2,327మందికి పంపిణీ చేశారు. 1,664 మందికి ఆర్డర్‌పై అద్దాలు తెప్పించనున్నారు.

శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏర్పాటై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫిబ్రవరి 22న నిర్వహించే శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి కోరారు. సోమవారం డీసీసీబీ అర్ధవార్షిక మహాజన సభను నిర్వ హించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతులు తమ పాత బకాయిలు చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని, సొసైటీ చైర్మన్లు వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీమ్‌ను రైతులకు తెలియజేసి బకాయిలను వసూలు చేయాలన్నారు. గతంలో ప్రకటించిన ఓటీఎస్ స్కీమ్ మార్చి 31వరకు పొడిగించడం జరిగిందని, ఐవోడీ (30శాతం) కంటే ఎక్కువ పెంచడం కుదరదన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి ఓటీఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకుని బకాయిలు చెల్లించాలన్నారు. అనంతరం సొసైటీ చైర్మన్లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనం ప్రకటించడం, సిబ్బందికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయడంపై డీసీసీబీ పాలకవర్గ సభ్యులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సభలో మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, డీసీసీబీ పాలకవర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, కిష్టాగౌడ్, గంగారెడ్డి, సాయికుమార్, శ్రీనివాస్ రెడ్డి, పాలకవర్గ సభ్యులతో పాటు సొసైటీల చైర్మన్లు, డీసీవోలు సింహాచలం వసంత, డీడీఎం నగేశ్, బ్యాంకు సీఈవో గజానంద్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

ఆడపిల్ల మహాలక్ష్మే!

సృష్టికి మూలం అమ్మ.. ఆమె లేకుంటే జగమే లేదు. అమ్మంటే ఆడపిల్ల. ఇవన్నీ తెలిసినా మనిషి ఆడపిల్లను భారంగానే భావిస్తున్నాడు. పుట్టకముందే తల్లి గర్భంలోనే హత్య చేయడానికీ వెనుకాడడం లేదు. కానీ ఆ గ్రామం దీనికి మినహాయింపు. అక్కడ ఆడపిల్లలను మహాలక్ష్మిగా భావిస్తున్నారు. స్కానింగ్‌లు, అబార్షన్ల జోలికి వెళ్లడం లేదు. ఆడయినా, మగయినా సమానంగా స్వీకరిస్తున్నారు. వారిని చక్కగా చదివిస్తూ లింగ వివక్షకు దూరంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు మద్నూర్ మండలంలోని లచ్చన్ గ్రామస్తులు.

– సేపూరి వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి

- ఆ ఊళ్లో కనిపించని లింగ వివక్ష
- స్కానింగ్‌లు, అబార్షన్ల ప్రస్తావనే లేదు..
- ఆదర్శంగా నిలుస్తున్న లచ్చన్‌వాసులు
- నేడు జాతీయ బాలికా దినోత్సవం



లచ్చన్ గ్రామ ముఖచిత్రం



సాక్షి, కామారెడ్డి : ఎంత అభివృద్ధి చెందుతున్నా సమాజంలో ఇప్పటికీ ఆడపిల్లలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. కడుపులో పెరిగేది ఆడపిల్ల అని తెలియగానే భ్రూణహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలూ ఉన్నాయి. దీంతో స్త్రీ పురుష జనాభా నిష్పత్తిలో తేడా ఉంటోంది. జిల్లా జనాభాలో ఆరేళ్లలోపు పిల్లల నిష్పత్తిని పరిశీలిస్తే.. వెయ్యి మంది మగ పిల్లలకు 941 మంది ఆడపిల్లలు ఉన్నారు. అదే మద్నూర్ మండలం లచ్చన్ గ్రామంలో మాత్రం దాదాపు సమానంగా ఉండడం గమనార్హం. ఇక్కడ ఆరేళ్ల లోపు బాలురు 72 మంది ఉండగా.. బాలికలు 70 మంది ఉన్నారు. చాలా కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు ఆడపిల్లలున్నారు. గ్రామంలో ఎవరూ ఆడపిల్ల అంటే చిన్నచూపు చూడరు. మగ పిల్లలతో సమానంగా పెంచుతున్నారు. చదివిస్తున్నారు.

రెండేళ్లుగా ఆడపిల్లల జననాలే ఎక్కువ..

ఆధునిక సమాజంలో కడుపులో పెరుగుతున్న బిడ్డ ఎవరో తెలుసుకునేందుకు చాలామంది ప్రయత్నిస్తున్నారు. ఆడ పిల్లని తెలిస్తే గర్భంలోనే ఊపిరి తీసేయడానికి వెనుకాడడం లేదు. అలాంటి కాలంలోనూ ఆ పల్లెవాసులు మాత్రం పుట్టే బిడ్డ ఎవరో తెలుసుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ఆడయినా, మగయినా సమానంగా స్వీకరిస్తున్నారు. ఆడపిల్ల భారం కాదని, లక్ష్మీదేవత అని అక్కున చేర్చుకుంటున్నారు. గ్రామంలో రెండేళ్లలో జననాలను పరిశీలిస్తే ఆ విషయం మరింత స్పష్టమవుతోంది.

2020–21 సంవత్సరంలో లచ్చన్ గ్రామంలో 28 మంది జన్మించారు. ఇందులో 16 మంది ఆడపిల్లలు కాగా 12 మంది మగ పిల్లలు.. 2021–22 సంవత్సరంలో 27 మంది జన్మిస్తే.. అందులో 21 మంది ఆడపిల్లలే ఉండడం విశేషం. ఆరుగురు మాత్రమే మగబిడ్డలు పుట్టారు.

చదువుల తల్లులే..

గ్రామంలో దాదాపు ఆడపిల్లలందరూ చదువుకుంటున్నారు. పది మంది డిగ్రీ, 39 మంది ఇంటర్ చదువుతున్నారు. ఏడుగురు ఉద్యోగాలు చేస్తున్నారు. ఒకరు సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా, మరొకరు స్టాఫ్ నర్స్‌గా, ఇంకొకరు బీపీఎంగా... ఇలా వివిధ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. గ్రామానికి చెందిన పిల్లల్లో చాలామంది గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్నారు. కొందరు మద్నూర్, మరికొందరు బిచ్కుంద వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న గురుకుల పాఠశాలల్లో ఈ గ్రామానికి చెందిన అమ్మాయిలు పదుల సంఖ్యలో ఉన్నారు. అక్కడ బాల్య వివాహాలు కూడా జరగడం లేదు. లింగ వివక్షకు దూరంగా ఉంటూనే బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తూ లచ్చన్‌వాసులు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆడపిల్లల్ని చదివిస్తున్నారు



నేను లచ్చన్‌లో పన్నెండేళ్లుగా పనిచేస్తున్నాను. అందరూ ఆడపిల్లలను చదివిస్తున్నారు. ఆడపిల్లల డ్రాపవుట్స్ లేవు. గతంలో ఒకకరిద్దరు బడి మానేస్తే.. వెళ్లి సముదాయించాం. అందుబాటులో ఇంటర్, డిగ్రీ కళాశాలలు లేకున్నా.. మద్నూర్, బిచ్కుందలకు వెళ్లి మరీ చదువుతున్నారు.

–విద్యావరణ్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, లచ్చన్

“ వివక్ష లేదు



మా ఊళ్లో ఆడపిల్లల విషయంలో ఎలాంటి వివక్ష ఉండదు. మగపిల్లలతో సమానంగా పెంచుతున్నారు. మాకు ఒక కూతురు ఉంది. ఆడపిల్ల పుట్టిందని ఇక్కడ ఏ ఒక్కరూ బాధపడరు. అమ్మాయిలను ఆప్యాయంగా చూసుకుంటారు.

–జాదవ్ లక్ష్మి, గృహిణి, లచ్చన్

పట్టుదలతో చదివా..



మా ఊళ్లో ఆడపిల్లలు అందరూ చదువుతున్నారు. ఇక్కడ ఎలాంటి వివక్ష ఉండదు. నేను పట్టుదలతో చదివి సీఆర్‌పీఎఫ్ ఉద్యోగం సాధించిన. దేశానికి సేవ చేయాలని వెళ్లిన. ఆడపిల్ల అయినా దేశ సేవ కోసం ముందుకు వచ్చిన.

– సుజాత, సీఆర్‌పీఎఫ్ జవాన్

ఆనందంగా ఉంది..



అంగన్‌వాడీ కేంద్రాల వారీగా పుట్టిన పిల్లల వివరాలను పరిశీలించినపుడు లచ్చన్‌లో ఆడపిల్లలు ఎక్కువగా పుడుతున్నారని గమనించి సంతోషం అనిపించింది. మా టీచర్లతో మాట్లాడితే ఎవరూ అబార్షన్ల జోలికి వెళ్లరని చెప్పారు.

–సునంద, సీడీపీవో, మద్నూర్

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డిబార్‌

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల్లో సోమవారం నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలోని ఉమెన్స్‌ కళాశాల పరీక్ష కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒక విద్యార్థి డిబారైనట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అరుణ తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ నాల్గో సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలో 141 మంది విద్యార్థులకు గానూ 130 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన మూడో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలో 437 మందికి గానూ 409 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారని కంట్రోలర్‌ అరుణ తెలిపారు.

ఫిబ్రవరి 4 వరకు బీఈడీ పరీక్ష ఫీజు గడువు

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ బీఈడీ రెండో సంవత్సరం 3వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్ష ఫీజు ను ఫిబ్రవరి 4 వరకు చెల్లించాలని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 100 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 7 వరకు, రూ.200 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 8 వరకు, రూ.500 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 9 వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని కంట్రోలర్‌ అరుణ తెలిపారు. ఈ పరీక్షలు ఫిబ్రవరిలో జరుగుతాయని ఈ విషయాన్ని తెయూ పరిధిలోని బీఈడీ కళాశాలల ప్రధానాచార్యులు, విద్యార్థులు గమనించాలన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ www. telanganauniversity.ac.in ను సందర్శించాలని ఆమె సూచించారు.

గిరిజనులతో డిప్యూటీ డీఎంహెచ్‌వో నృత్యం



నాగిరెడ్డిపేట : మండలంలోని బెజుగంచెరువు తండా జీపీలో ఉన్న ఏర్రకుంట తండాలో సోమవారం నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమ తనిఖీకి వచ్చిన డిప్యూటీ డీఎండ్‌హెచ్‌వో శోభారాణి గిరిజన వేషధారణతో అలరించారు. కంటివెలుగు కార్యక్రమాన్ని తనిఖీ చేసిన ఆమె అక్కడే ఉన్న గిరిజన మహిళలతో కూర్చొని కాసేపు ముచ్చటించారు. దీంతోపాటు వారి కోరిక మేరకు గిరిజన వేషధారణలో కనిపించారు.అనంతరం తండా సర్పంచ్‌ మంగ్లి, ఇతర మహిళలతో కలిసి ఆమె గిరిజనుల సాంప్రదాయ నృత్యం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వారిలో కలిసిపోయి నృత్యం చేయడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ దాడులు



ఖలీల్‌వాడి : పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ దాడులు చేపట్టింది. నగరంలోని ఆరో పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని డెయిరీ ఫారం, సారంగపూర్‌ సమీపంలో పేకాడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ వెంకటేశ్‌ తెలిపారు. పేకాట స్థావరంలోని 13 మందిని పట్టుకొని 6వ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో అప్పగించారు. దాడి చేసిన సమయంలో ఒకరు పరారైనట్లు పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి 12 సెల్‌ఫోన్లు, రూ.25,220 లతోపాటు రెండు బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

రుద్రూర్‌ : రుద్రూర్‌ మండల కేంద్రానికి చెందిన మదారి గంగారాం (50) అనే వ్యక్తి సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెంది ఇంటి ముందున్న స్లాబ్‌కు ఉరి వేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పుల బాధతోనే గంగారాం ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య అనురాధ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్‌ తెలిపారు.

కాగితంపై ఫిర్యాదిచ్చినా పరిశీలించాలి

- చిరునవ్వుతో సమస్యలు పరిష్కరించాలి
- దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచవద్దు
- కలెక్టర్‌ నారాయణరెడ్డి



ప్రజావాణికి వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్‌ నారాయణ రెడ్డి

నిజామాబాద్‌ నాగారం : ఎన్నో ఆశలు పెట్టుకుని తమ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టరేట్‌లో తెల్లకాగితంపై దరఖాస్తులు సమర్పిస్తారని, వాటిని నిర్లక్ష్యం చేయరాదని, చిరునవ్వుతో పరిష్కార మార్గం చూపాలని అధికారులను కలెక్టర్‌ నారాయణ రెడ్డి ఆదేశించారు. కొత్త కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి 79 ఫిర్యాదులు రాగా, ఫిర్యాదులను కలెక్టర్‌తో పాటు డీఆర్డీఓ చందర్‌, జెడ్పీ సీఈవో గోవింద్‌, డీపీవో జయసుకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు.

విధుల్లోకి తీసుకోవాలని విన్నపం

కాంట్రాక్ట్‌ పద్ధతిలో డీఎంహెచ్‌వో శాఖలో స్టాఫ్‌నర్సులుగా విధులు నిర్వహించిన 23 మందిని అన్యాయంగా తొలగించారని విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌ నారాయణరెడ్డికి వారు విన్నవించారు. ఐదేళ్ల పాటు విధులు నిర్వహించిన మాకు గత రెణ్నెళ్ల క్రితం విధుల్లో నుంచి తీసేశారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్టాఫ్‌ నర్సులను విధుల్లోకి తీసుకున్నారని మాకు తీరని అన్యాయం చేశారని వారు వాపోయారు. న్యాయం చేయాలని వేడుకున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లా భవన నిర్మాణ రంగాల కార్మి క సంఘం అధ్యక్షుల కల్లెడ గంగాధర్‌ మాట్లాడుతూ, వెల్ఫేర్‌ బోర్డులో రూ.కోట్లు ఉన్నా కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. అర్హులైన కార్మికులందరికి లేబర్‌కార్డులు ఇవ్వాలన్నారు. నగర అధ్యక్షుడు భాస్కర్‌, నాయకులు శ్రీకాంత్‌, ఈశ్వర్‌, సాయరెడ్డి, శేఖర్‌, రాములు, రాంచందర్‌ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

'రిపబ్లిక్‌ డే'కు విస్తృత ఏర్పాట్లు

ప్రజావాణి అనంతరం కలెక్టర్‌ అధికారులతో పలు అంశాలపై సమీక్ష జరిపారు. గణతంత్ర దినోత్సవానికి విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల ప్రగతిని వివరించేలా శకటాల ప్రదర్శనతో పాటు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడ కూడా జాతీయ జెండా గౌరవానికి భంగం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అట్టహాసంగా రిపబ్లిక్‌ డే ఉత్సవాలు జరిపేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా, కార్మిక శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న 'ఈ - శ్రమ్‌' పోర్టల్‌ లో అసంఘటిత రంగ కార్మికుల పేర్లను నమోదు చేయించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్‌ సూచించారు. అర్హులైన కార్మికులందరి పేర్లు పోర్టల్‌లో నమోదయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం సౌర విద్యుత్‌ యూనిట్ల ఏర్పాటు కోసం 'స్త్రీ నిధి' రుణాలు అందించే కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన కరపత్రాలను కలెక్టర్‌ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇప్పించాలి



గౌతంనగర్‌కు చెందిన లావణ్య

నగరంలోని గౌతంనగర్‌కు చెందిన లావణ్య భర్త వదిలేయడంతో తన వికలాంగురాలైన కూతురితో ఒంటరిగా జీవిస్తున్నానని, ప్రభుత్వం తరపున డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇప్పించాలని ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

మతాల పేరుతో రెచ్చగొడుతున్నారు

- ఆర్టీసీ చైర్మన్‌, రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్‌, రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌

డిచ్‌పల్లి : కొందరు పనికిమాలిన మాటలు మాట్లాడుతూ, మతాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతూ గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అలాంటి వారిపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆర్టీసీ చైర్మన్‌, రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని తన నివాసంలో డిచ్‌పల్లి మండలంలోని పలు గ్రామాల బాధితులకు సీఎంరిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మండలంలోని యానంపల్లికి చెందిన గంగాప్రసాద్‌ కు రూ.26వేలు, సాకలి సాయమ్మకు రూ.56వేలు, యానంపల్లి తాండకు చెందిన గుగులోత్‌ లలితకు రూ. 32 వేలు, రాజుకు రూ.36 వేలు, సాంపల్లి ఉపసర్పంచ్‌ మోహన్‌కు రూ.75 వేల చెక్కులను అందజేశారు. జిల్లా ఒలింపిక్‌ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్‌, డిచ్‌పల్లి మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు దాసరి ల క్ష్మీనర్సయ్య, శక్కరి కొండ కృష్ణ, ఎంపీటీసీ సాయి లు, సర్పంచ్‌ గోపు చిన్నుబాయి గంగాధర్‌, నీల బలరాం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ఇతర పార్టీలకు ఆదర్శం

నిజామాబాద్‌ సిటీ : కార్యకర్తలను ఆదుకోవడంలో రాజకీయ పార్టీలకు బీఆర్‌ఎస్‌ ఆదర్శమని రూరల్‌ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్‌ బాజిరెడ్డి గోవర్ధన్‌ అన్నారు. సోమవారం రూరల్‌ ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకు పార్టీ ఇన్సూరెన్స్‌ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియాశీల రాజకీయల్లో ఉంటూ ప్రమాదవశాత్తు మృతిచెందితే ఆ కుటుంబం వీధిన పడకుండా బీఆర్‌ఎస్‌ ఆదుకుంటుందన్నారు. రూరల్‌ మండలంలోని గాంధీనగర్‌కు చెందిన బానోత్‌ శంకర్‌ ఇటీవల చెట్టుపై నుంచి పడి మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులైన బనోవత్‌ కోమలి బాయ్‌కు రూ. 2 లక్షలు ఇన్సూరెన్స్‌ చెక్కును ఎమ్మెల్యే క్యాంప్‌ ఆఫీస్‌లో అందజేశారు. మండల వైస్‌ ఎంపీపీ అన్నం సాయిలు, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌ రావు, గుండారం సొసైటీ చైర్మన్‌ దాసరి శ్రీధర్‌, ప్రేమ్‌నాయక్‌, గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల ఎస్టీసెల్‌ అధ్యక్షుడు బానోత్‌ గోపాల్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు వైస్‌ ఎంపీపీ రాజీనామా



శ్రీనివాస్‌ రెడ్డి

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): అంతర్గత విభేధాలు, పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో బీఆర్‌ఎస్‌ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వైస్‌ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మండల కేంద్రంలోని తన నివాసంలో మాట్లాడుతూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. బీఆర్‌ఎస్‌లో పదవులు చేపడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు, వైస్‌ ఎంపీపీలకు విలువ లేకపోవడం వల్లే రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏదును చంపిన ముగ్గురిపై కేసు నమోదు



కామారెడ్డి టౌన్‌ : తాడ్వాయి మండలం సంతాయిపేట అటవీప్రాంతంలో ఏదు(ముళ్ల పంది)ని చంపిన ముగ్గురు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేసి వారిపై కేసును నమోదు చేశారు. సోమవారం కామారెడ్డి ఎఫ్‌ఆర్‌వో రమేశ్‌ కేసు వివరాలను వెల్లడించారు. లింగంపేట రిజర్వ్‌ ఫారెస్ట్‌ పరిధిలో సంతాయిపేట అటవీ ప్రాంతంలో సంతాయిపేటకు చెందిన సూర స్వామి, దేవునిపల్లికి చెందిన దాసరి పెంద్యాల, దాసరి నరేందర్‌ ఏదు(ముళ్లపంది)ని వేటాడి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి తరలిస్తుండగా వారిని వెంబడించి వారి ఇంటి వద్ద పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. ఆ ముగ్గురిపై అడవి జంతువుల రక్షణ చట్టం 1972 కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తైక్వాండోలో జిల్లాకు పతకాల పంట



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

- 18 గోల్డ్‌ మెడల్స్‌ సాధించిన క్రీడాకారులు
- బస్వా లక్ష్మీనర్సయ్యకు గోల్డ్‌ మెడల్‌


సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌ : బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్యకు తైక్వాండోలో ఇచ్చిన ప్రదర్శనకు తాజాగా మరో పతకం దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసినందుకు గాను బస్వాకు గోల్డ్‌మెడల్‌తో పాటు బ్లాక్‌బెల్ట్‌ లభించింది. రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్‌ సభ్యులు బస్వాకు పతకం ఇచ్చి సత్కరించారు. ఇదిలా ఉండగా బస్వాతో పాటు మొత్తం 18మ మందికి బంగారు పతకాలు, నలుగురికి సిల్వర్‌ పతకాలు, ఐదుగురికి కాంస్య పతకాలు వచ్చాయి. తైక్వాండో కోచ్‌ మనోజ్‌ ద్వారా ప్రావీణ్యం సాధించిన బస్వా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన చేయడంతో జాతీయ స్థాయికి ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. దీంతో బస్వాను పలువురు అభినందించారు.

ప్రైవేట్‌ కళాశాలలపై ఫిర్యాదు



నిజామాబాద్‌ అర్బన్‌ : బోధన్‌లోని విజయ సాయి, షిర్డీసాయి జూనియర్‌ కళాశాలలపై సోమవారం రాష్ట్ర ఇంటర్‌ బోర్డు కార్యదర్శి నవీన్‌ మిట్టల్‌కు ఏఐఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ బోధన్‌ పట్టణంలో ఉన్న పై రెండు కళాశాలలు నారాయణ విద్యాసంస్థల పేరుతో బ్రోచర్లు తయారుచేసి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. ఏఐఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రహ్మాన్‌ ఇంటర్‌ బోర్డు కమిషర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

టీచర్ల బదిలీ షెడ్యూల్‌ ఖరారు



నిజామాబాద్‌ అర్బన్‌ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి షెడ్యూల్‌ రావడంతో ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 27 నుంచి బదిలీలు ప్రారంభ కానున్నాయి. ఈ నెల 20 నుంచి 30 దాకా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. అనంతరం మార్చి 4వ తేదీ వరకు బదిలీలు, పదోన్నతులు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. అనంతరం 5 తేదీ నుంచి 20వ తేదీ వరకు అప్పీళ్ల స్వీకరణ ఉంటుంది. బదిలీలు పదోన్నతుల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఇలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు వెనిగర్ల సురేశ్‌ డిమాండ్‌ చేశారు. అలాగే 317 జీవో కింద వేర్వేరు ప్రాంతంలో ఉంటున్న భార్యభర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం : 9వ నేషనల్‌ మాస్టర్‌ అథ్లెటిక్స్‌ పోటీల్లో జిల్లా అథ్లెటిక్స్‌ క్రీడాకారులు పథకాల పంట పండించారు. ఈ నెల 21, 22 తేదీల్లో మెదక్‌ జిల్లాలో జరిగిన 9వ నేషనల్‌ మాస్టర్స్‌ టోర్నీలో జిల్లా మాస్టర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో 39 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో 16 మంది పురుషులు, 12 మహిళలు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన వారిలో శీను నాయక్‌, బద్దం గోపిరెడ్డి, కేవీ కిరణ్‌, గోపి, దశరథ్‌, దినేష్‌ ఉత్తం, నరసయ్య, సంగీతరావు, అశోక్‌, ఖమర్‌, కే అశోక్‌, జి అశోక్‌, ఎం శ్రీనివాస్‌, నరేందర్‌, మహిళల విభాగంలో నీతా రెడ్డి, రేఖారాణి, కవిత, సంగీత, అనురాధ, ఇందిరా, పల్లవి రెడ్డి, సుకన్య , శాంత, ప్రమీల, సాయమ్మ, ప్రతిభ, పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా మాస్టర్స్‌ అథ్లెటిక్స్‌ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్‌ శీను నాయక్‌ బద్దం గోపిరెడ్డి ట్రెజరర్‌ నీతారెడ్డి ఆర్గనైజింగ్‌ సెక్రటరీ కిరణ్‌ కుమార్‌, ఇతర క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయ భూమిలో పరస్పర దాడులు



కర్రలతో దాడి చేసుకుంటున్న ఇరువర్గాలు

దోమకొండ : మండల కేంద్రంలోని సంఘమేశ్వర్‌ రోడ్డులో ఎడ్లకట్ట వాగు శివారులో సోమవారం వ్యవసాయభూమి వద్ద ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో పలువురికి గాయాలైనట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. ఇరువర్గాలకు చెందిన వారు తమ వ్యవసాయ భూములకు సంబంధించి హద్దులను పాతే సమయంలో ఘర్షణ జరిగిందన్నారు. గ్రామానికి చెందిన ఉల్లే రాజయ్య, ఉల్లే శేఖర్‌ కుటుంబాల మధ్య ఘర్షణ జరిగగా, పరస్పరం కర్రలతో దాడులకు దిగారు. దీంతో ఇరు కుటుంబాలకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముందుగా దోమకొండ ప్రభుత్వ ఆస్పత్రికి వారిని చికిత్స నిమిత్తం తరలించి, అనంతరం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భార్యపై భర్త దాడి

- అడ్డువచ్చిన వారిని చితకబాదిన వైనం
- దాడిలో బీఆర్‌ఎస్‌ నేత అనుచరుల హస్తం..!
- కేసు నమోదు చేసిన ఒకటవ టౌన్‌ పోలీసులు

ఖలీల్‌వాడి : బీఆర్‌ఎస్‌ నేతల బెదిరింపులు జిల్లా కేంద్రంలో రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల ఓ మడిగె వివాదంలో బీఆర్‌ఎస్‌ నేత బెదిరింపు వాయిస్‌ మెసేజ్‌ కలకలం రేపగా తాజాగా భార్యభర్తల పంచాయితీలో బీఆర్‌ఎస్‌ నేతలు తలదూర్చి దాడికి పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఒకటోటౌన్‌ పరిధిలోని ఖలీల్‌వాడిలో ఓ హాస్పిటల్‌ నిర్వాహకుడైన వంశీకిరణ్‌కు పూసలగల్లీకి చెందిన యువతితో మూడేళ్ల క్రితం వివాహమైంది. కొన్ని రోజుల తర్వాత భార్యభర్తల మధ్య విభేదాలు రావడంతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. భార్యాభర్తల మధ్య పంచాయితీని ఇరువైపులా పెద్దలు కలిసి పలుమార్లు మాట్లాడినట్లు తెలిసింది. ఇటీవలి కాలంలో ఈ పంచాయితీ పోలీసుల చెంతకు కూడా చేరింది. అయితే తరచూ వేధింపులకు గురవుతున్న భార్య తన పుట్టింటికి వెళ్లిపోయిన భార్య ఇటీవల భర్త ఇంటికి వచ్చింది. దీంతో మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. అయితే ఖలీల్‌వాడిలోని తన ఇంటికి వచ్చిన భార్య, ఆమె సంబంధీకులపై ఆదివారం రాత్రి భర్త తన 10 మంది స్నేహితులు, మున్సిపల్‌ ఉద్యోగితో కలిసి దాడికి పాల్పడ్డాడు. దాడి విషయం పోలీసులు ఘటనస్థలానికి చేరుకోగా భర్త వంశీకిరణ్‌తో పాటు మిగితా వ్యక్తులు పరారయ్యారు. పోలీసులు భర్తతో పాటు హంగామా చేసిన పలువురిపై కేసులు నమోదు చేయాల్సి ఉండగా కేవలం కొంతమందిపై మాత్రమే కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని ఆరోపణలున్నాయి. ఇందులో బీఆర్‌ఎస్‌కు చెందిన నేత అనుచరులు, పాత నేరస్తులు, ఓ మున్సిపల్‌ ఉద్యోగి ఉండడం విశేషం బీఆర్‌ఎస్‌కు చెందిన నేత అనుచరులున్నారని కేసు ను నీరుగారుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబును వివరణ కోరగా భార్యపై దాడికి పాల్పడిన భర్తతో పాటు మున్సిపల్‌ ఉద్యోగి, పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యకేసులో నిందితుడిని శిక్షించాలి



రాస్తారోకో కారణంగా నిలిచిపోయిన వాహనాలు

మోర్తాడ్‌(బాల్కొండ): ఆరు నెలల కింద తమ కూతురు, మనుమడిని హత్య చేసిన నవీపేట్‌కు చెందిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేస్తూ మోర్తాడ్‌లో బాధిత కుటుంబ సభ్యులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. మోర్తాడ్‌కు చెందిన శారదను నవీపేట్‌కు చెందిన శ్రీనివాస్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. శారదను ఆమె కొడుకు హర్షవర్ధన్‌ను శ్రీనివాస్‌ సోదరుడు శేఖర్‌ హత్య చేశాడు. ఈ కేసులో శేఖర్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇటీవల బెయిల్‌పై ప్రధాన నిందితుడితో సహా ఇతరులు విడుదలై ఇంటికి వచ్చారు. నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ శారద కుటుంబ సభ్యులు రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు చర్చలు జరిపి నిందితులకు శిక్షపడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో ఇద్దరికి జైలు శిక్ష



డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్ష చేస్తున్న పోలీసులు

భిక్కనూరు : మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి కోర్టు రెండు రోజుల శిక్ష విధించినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్‌ సోమవారం తెలిపారు. దోమకొండ మండల కేంద్రానికి చెందిన పెద్ది ప్రవీణ్‌కుమార్‌ మద్యం సేవించి వాహనం నడుపుతూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడని అలాగే ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్‌ రాజ్‌కుమార్‌ మద్యం సేవించి డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షల్లో పట్టుబడ్డాడన్నారు. వీరిని అరెస్టు చేసి సోమవారం కామారెడ్డి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వీరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 200 జరిమానా విధించారన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



మాట్లాడుతున్న ఆర్మూర్‌ రూరల్‌ సీఐ గోవర్ధన్‌రెడ్డి

వేల్పూర్‌ : వేల్పూర్‌ క్రాస్‌రోడ్డు వద్ద గంజాయి అమ్ముతున్న మహమ్మద్‌ అంజాద్‌ అలీ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆర్మూర్‌ రూరల్‌ సీఐ గోవర్ధన్‌రెడ్డి సోమవారం వేల్పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఆర్మూర్‌ మండలం పెర్కిట్‌కు చెందిన ఇతడు జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు నాందేడ్‌ ఏరియా నుంచి గంజాయి తీసుకొచ్చి చిన్నచిన్న ప్యాకెట్లలో అమ్ముతున్నాడని తెలిపారు. అతని వద్ద 300 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌, 15 చిన్న ఖాళీ ప్లాస్టిక్‌ కవర్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయి విక్రేతను పట్టుకున్న వేల్పూర్‌ పోలీసులను అయన అభినందించారు. ఈ కార్యక్రమలలో వేల్పూర్‌ ఎస్సై వినయ్‌కుమార్‌, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

కుంటలో పడి యువకుడి మృతి



మృతి చెందిన మహేశ్‌

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వెనక ఉన్న పోచమ్మ కుంటలో ప్రమాదవశాత్తు యువకుడు పడి మృతి చెందినట్లు ఎస్సై గణేశ్‌ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఇందిరానగర్‌ కాలనీకి చెందిన శెట్టిగారి మహేశ్‌ (25) తన మిత్రులైన సాయిబాబా, నాగరాజులతో కలిసి కుంట శివారులో మద్యం సేవించారని అన్నారు. మహేశ్‌ మలవిసర్జన కోసం కుంటలోకి దిగగా ప్రమాదవశాత్తు జారి కుంటలో పడినట్లు ఆయన తెలిపారు. ఈత రాకపోవడంతో మహేశ్‌ నీటిలో మునిగి మృతి చెందాడని అన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి మూడేళ్ల కుమారుడు ఉండగా భార్య కృష్ణవేణి గర్భిణిగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

టిప్పర్‌ ఢీకొన్న ఘటనలో రెండు గేదెలు..

మాక్లూర్‌ : టిప్పర్‌ ఢీకొట్టగా రెండు పాడిగేదెలు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి మాక్లూర్‌ మండల కేంద్రంలో నందిపేట వెళ్లే రహదారిపై జరిగింది. అనిల్‌ అనే రైతుకు చెందిన మూడు పాడి గేదెలు రహదారిపై వెళ్తుండగా వేగంగా వెళ్తున్న టిప్పర్‌ ఢీకొట్టగా రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో గేదె కాలు విరిగి నడువలేని స్థితిలో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతి చెందిన రెండు పాడిగేదెలు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతు అనిల్‌ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిజామాబాద్‌ సిటీ : నిజామాబాద్‌ రూరల్‌ మండలం ఖానాపూర్‌ శివారు వ్యవసాయ భూమిలో ఓ గుర్తు తెలియని వృద్ధ మహిళ(70) మృతదేహం లభ్యమైనట్లు సోమవారం ఎస్సై లింబాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన ఎనదుల కిరణ్‌ వ్యవ సాయ భూమిలో వృద్ధురాలి మృతదేహం ఉందని గ్రామస్తులు పోలీసులకు సమాచారమివ్వగా మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించారు. వృద్ధురాలికి సంబంధించిన వారుంటే రూరల్‌ పీఎస్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

కామారెడ్డి పట్టణంలో..

కామారెడ్డి క్రైం : జిల్లా కేంద్రానికి సమీపంలోని రామేశ్వర్‌పల్లి రోడ్డులో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రామేశ్వర్‌పల్లి సమీపంలోని చెట్ల పొదల్లో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సోమవారం సాయంత్రం సమాచారం రావడంతో పట్టణ, రూరల్‌ పోలీసులు సందర్శించారు. మృతురాలి వయస్సు 45-50 మధ్య ఉండవచ్చని తెలిపారు. సదరు మహిళ ఎవరనేది తెలియరాలేదు. పూర్తిగా కుళ్ళిన స్థితిలో ఉంది. మృతి చెంది నెల రోజులు కావచ్చని, మహిళ హత్యకు గురి కావచ్చనే అనుమానాలు ఉన్నాయి.